

'రౌద్రముఖి' లఘు చిత్ర నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు

ఎస్ఎఫ్ సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో రచయిత ఆనంద్ అందించిన స్క్రిప్ట్‌తో సుహేల్ డిఓపి, దర్శకుడిగా 'రౌద్రముఖి' లఘు చిత్ర నిర్మాణం ప్రారంభించినట్లు నిర్మాత సురేష్ తెలిపారు. శుక్రవారం పీలేరు కోటపల్లె లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చిత్ర నిర్మాణానికి ముందు పూజా కార్యక్రమాలు జరిగాయి. మూఢనమ్మకాలు ఎలాంటి దుష్పరిణామాలకు దారితీసే స్థాయి అన్న బ్యాక్ డ్రాప్‌తో ఈ లఘు చిత్రం నిర్మిస్తున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు. తలకోన, దేవరకొండ, పీలేరు పరిసర ప్రాంతాల్లో రెండు షెడ్యూళ్లలో చిత్ర నిర్మాణం జరగనుందన్నారు. ఈ లఘు చిత్రంలో ప్రధాన పాత్రల్లో 'ఆల్ ది బెస్ట్' భాస్కర్ బాషా, సురేష్, మల్లికార్జున, బాబ్జాన్, విజయ్, జు, మహేష్, అమ్ములు, సాక్షి, నాజర్, ప్రభ, బాలనటి ఆరాధ్య, తరిగొండ రాధాకృష్ణ ఉన్నారు.



చిత్ర నిర్మాణానికి క్లాప్ కొడుతున్న సురేష్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఆశయం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పోలీసుస్టేషన్ భవనాలు ప్రారంభం



ఆర్‌కె వ్యాలీ పోలీసుస్టేషన్‌ను ప్రారంభిస్తున్న జగన్, స్టేషన్‌లో సంతకం చేస్తున్న సీఎం

ప్రజాశక్తి-వేంపల్లె

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఇడుపుల పాయ ఆర్కే వ్యాలీలో రూ.1.75 కోట్లతో నిర్మించిన పోలీసు స్టేషన్, రూ.2.75కోట్లతో నిర్మించిన జమ్మలమడుగు పోలీసుస్టేషన్లను ప్రారంభించారు. ఇడుపులపాయ నెమళ్ల పార్కు వద్దనున్న ప్రేయర్ హాలులో వేముల మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం అలుపెరగకుండా శ్రమిస్తున్న వేముల మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సహకారం అందిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ముందుగా సొంత నియోజకవర్గ ప్రజలపై ఉన్న మమకారం, స్థానిక బంధువులు, స్నేహితులు, సన్నిహితులను ఒకేచోట కలిసిన ఆనందంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నియోజకవర్గ నాయకులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి చనిపోయాక మీరంతా అందించిన ప్రోత్సాహం, సహకారం, మనోధైర్యంతో ఈ రోజు ముఖ్యమంత్రిగా మీ ముందు నిలిచి మీ అందరి మేలు కోసం పాటుపడుతున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాడా అభివృద్ధి పనుల పురోగతిపై ముఖ్యమంత్రికి కలెక్టర్ వి.విజయ రామరాజు క్లుప్తంగా వివరించారు. వేముల మండలం పరిధిలో పాడా, ఇతర శాఖల ద్వారా జరుగుతున్న మొత్తం అభివృద్ధి పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పాడా ఓఎస్డి అనిల్ కుమార్‌రెడ్డి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం పలువురు నాయకులు మండలంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రికి సలహాలు ఇచ్చారు. పలువురు పలు అంశాలపై వినతి పత్రాలను అందించటంతో పాటు, నేరుగా ముఖ్యమంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నాలుగున్నర సంవతసర కాలంలో వేముల మండల పరిధిలో రోడ్లు, డ్రెయినేజీలు పనులు పూర్తి అయ్యాయని నల్ల చెరువు దగ్గర బ్రిడ్జి పనులు త్వరితగతిన జరుగుతున్నాయని తెలిపారు. పెర్లపాడు దగ్గర వేర్ హౌస్, ఐటిఐ, జూనియర్ కాలేజ్‌లు నూతనంగా నిర్మించడంపై ఆనందం వ్యక్తం చేశారు. వేములలో తిరునాలగుట్ట బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. పెంచికల బసిరెడ్డి కాలువ (పివిసి)లో మొక్కలు పెరిగాయని, డిస్ట్రిబ్యూ టర్లకు క్లీన్ చేయించాలని, సిమెంట్ లైన్ నిర్మించాలని కోరారు. నల్లచె రువు గ్రామం పరిధిలో 1600 ఎకరాలు వున్నాయని అవి పైతట్టు ప్రాంతంలో వుండడం వలన నీరు అందడం లేదని పివిసి ద్వారా లిఫ్ట్ చేయించాలని కోరారు. మండలంలో 76 సంపులలో ఐదు పూర్తి అయ్యాయని మొత్తం అభివృద్ధి చేస్తే 15 వేల ఎకరాలకు సాగు నీటిని అనుకూలంగా వుంటుందన్నారు. పెండ్లూరు చెరువుకు కుడి ఎడమ కాలువలని ఏర్పాటు చేస్తే 1100 ఎకరాలకు ఆయకట్టు కిందికి వస్తాయని కోరారు. గాలేరు నగరి కెనాల్ నుండి నారాపల్లి చెరువుకు నీటిని లిఫ్ట్ చేస్తే మరికొన్ని ఎకరాలు సాగు చేయొచ్చని తెలిపారు. వేముల సమీపంలో మినరల్ ఎక్కువగా వున్నాయని బైరటీస్, స్టోన్ వంటి ఖనిజాలను సంబంధించి ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి లభిస్తుందని కోరారు. పత్తికి సజ్జలకు క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింప జేయాలని, రబీలో మినుములు, పెసర రైతులకు రాయితీలు కల్పించాలని కోరారు. కార్యక్రమం చివరలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జరిగే 56వ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను సిఎం విడుదల చేశారు. కడప విమానాశ్రయంలో సిఎంకు నాయకులు వీడ్కోలు పలికారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ధనుంజయరెడ్డి, ఒఎస్‌డి కృష్ణ మోహన్‌రెడ్డి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డిఐజి షేంతల్ కుమార్, ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, జడ్‌పి చైర్మన్ ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి, నగర మేయర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎం.రామచంద్రారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కడప ఆర్‌డిఒ మధుసూదన్, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషా రాణి, పొల్యూషన్ బోర్డు చైర్మన్ ఎం.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



స్టేషన్ లోపలి పరిసరాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

- తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆత్మరక్షణ పేరిట పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని తక్షణమే ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని, గాజాలో చిన్నారులు, మహిళలకు రక్షణ కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు సగిర్ డిమాండ్ చేశారు. పాలస్తీనాకు మద్దతుగా శుక్రవారం వామపక్షాల రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు రాయచోటి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యుద్ధం వద్దు ప్రపంచ శాంతిని నెలకొల్పాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని నిరదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాలస్తీనా గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు కారనంగా మహిళలు పసిపిల్లలు వేలాది మంది ప్రాణాలను పోగొట్టుకున్నారని తెలిపారు. పాలస్తీనా ప్రజలపై యూదుల దురహంకారాన్ని ఇజ్రాయిల్ ప్రదర్శిస్తోందని విమర్శించారు. గాజాలో కిరాతకమైన రీతిలో మారణహోమం సాగిస్తోందని, శరణార్థి శిబిరాలు, ఆసుపత్రులపై దాడులు చేస్తున్నారన్నారు. తక్షణమే కాల్పుల విరమణ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులను హింసించడం, వేదించడం చంపేయడం ద్వారా సమస్య తీవ్రతరం అవుతుందేకానీ సమస్యలు పరిష్కారం కాదన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా దాని మిత్ర దేశాలు ఆర్థిక,సైనిక, సాయుధ సహాయాన్ని అందిస్తుండటం ఆపేక్షనీయమన్నారు. కాల్పుల విరమణ కోసం స్వరం పెంచడం అనివార్యం అన్నారు.ఇందుకు భారతీయులంతా కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్, సిపిఎం నాయకులు డిసి వెంకటయ్య, నాగబసిరెడ్డి, మాధవయ్య, రెడ్డెయ్య, శేఖర్ నాయక్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్ కుమార్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకట్రామయ్య, ఎఐటియుసి నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు. **మదనపల్లె :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని కండిస్తూ సిపిఐ, జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అనిబిసెంట్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు మురళి, కొన భాస్కర్, తిరుమల, సూరి, మాధవ్, వాసు, ఓబులేసు పాల్గొన్నారు. **మొలకలచెరువు :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఐ నాయకులు నిరసన తెలిపారు. కార్యాక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అంజనప్ప, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్, లక్ష్మీదేవి, అమరావతి, సుబ్బన్న, శివప్ప, రమణప్ప, కుత్తన్న, నరసింహులు, వేమనారాయణ, చౌడప్ప, ఆనంద, కదిరప్ప పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని, వారి కేటాయింపులో జాప్యం ఉండ కూడదని, పోలింగ్ కేంద్రాల వారీగా ఇపి రేషియో, జెండర్ రేషి యోలలో తప్పులు ఉండరాదని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సెక్టోరల్ అధికారుల కేటాయింపు, రూట్ మ్యాపులు, లాజిస్టిక్ అవసరాలు, శిక్షణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఇబ్బందికర కేంద్రాల గుర్తింపు, ఇపి రేషియో, జెండర్ రేషియో, నియోజకవర్గ ఎన్నికల మేనేజ్మెంట్, ప్రత్యేక ప్రచార రోజులు, ఎన్నికలకు సంబంధించిన ఫారం లను త్వరగా క్లియర్ చేయడం వంటి అంశాలపై శుక్రవారం మధ్యాహ్నం ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారుల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలు కొన్ని నియోజకవర్గాల నుంచి రాలేదని, వాటిని త్వరగా పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క సెక్టోరల్ అధికారికి 6 పోలింగ్ స్టేషన్ల కంటే ఎక్కువగా కేటాయింపు ఉండకూడదని సూచించారు. ఒక్కొక్క రూటుకు ఒక్కొక్క సెక్టోరల్ అధికారిని కేటాయించేలా చూసుకోవాలని సూచించారు. వచ్చే మంగళవారానికల్లా సెక్టోరల్ అధికారుల కేటాయింపు పూర్తవ్వాలని ఆదేశించారు. లాజిస్టిక్ అవసరాలకు గురించి మాట్లాడుతూ... వాహనాల కేటాయింపు తదితర అంశాలను కూలంకషంగా పరిశీలించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని, వారికి ఏ ఏ పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇపి రేషియో మరియు జెండర్ రేషియోలలో ఎటువంటి తప్పులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు ఉండకూడదని ఆదేశించారు. బిఎల్ఒల సహకారంతో తహశీల్దార్లు, ఇఆర్ఒలు ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. నియోజకవర్గ ఎన్నికల మేనేజ్మెంట్ లోని వివిధ అంశాలను పక్కాగా అమలు పరచాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా పై ప్రత్యేక శిబిరాల గురించి వీధుల్లో టామ్ టామ్ చేయించాలని,ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం జరగాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

- రాయచోటి ప్రాజెక్టు కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీ కార్యకర్తల, ఆయాల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం సిద్ధమ్మ అధ్యక్షతన రాయచోటి ప్రాజెక్టు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయచోటి ప్రాజెక్ట్‌లోని దేవపట్ల, శెట్టిపల్లి-2 సెక్టార్లలో పనిచేస్తున్న వర్కర్స్, హెల్పర్స్‌కు 2022 ఆగస్టు నెల వేతనం పెండింగ్ ఉందని తెలిపారు. వీటితో పాటు అనేక సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్‌లో 90 మంది వరకు వేతనం పెండింగ్ ఉందన్నారు. అంగన్వాడీ సెంటర్ అద్దెలు 8 నెలలు, 4 నెలలు కూరగాయలు, గ్యాస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సమస్యలు వల్ల అంగన్వాడీలు అప్పులపాలు అవుతున్నారని తెలిపారు. రోడ్డు మీద పడే పరిస్థితి వచ్చినా అధికారులకు, ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరం లేదన్నారు. అంగన్వాడీ సెంటర్‌కు అందించే పాలు నాసిరకంగా ఉన్నాయని, పాలు పాకెట్స్ పగిలి పురుగులు పడుతున్నాయన్నారు. నాణ్యమైన పాలు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు అడిగితే అధికారులు పొంతన లేని సమాధానం చెప్తూ ఉన్నారని మండి పడ్డారు. సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే కాలంలో ప్రాజెక్ట్ ఆఫీస్ దగ్గర నిరవధిక దీక్షలు చేస్తామని అధికారులను హెచ్చరించారు. సమావేశంలో బంగారు పాప, ఖాజాబీ, నాగమణి, విజయ పాల్గొన్నారు.

రైతులు రసీదులు తీసుకోండి : ఎఒ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని రైతులు తమ పంటల వివరాలు, రైతుల వివరాలను పొందుపరిచిన భౌతిక రసీదులను సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో తీసుకోవాలని వ్యవసాయశాఖ ఎఒ హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా 2023వ సంవత్సరానికి సంబంధించిన పంటను నమోదు చేయడం జరిగిందన్నారు. పంట నమోదు చేసిన వివరాలను భౌతిక రసీదుల రూపంలో అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని, సంబంధిత రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి భౌతిక రసీదులను పొందాలని కోరారు.

సామాజిక పురోగతికి సోపానాలు గ్రంథాలయాలు

ప్రజాశక్తి-సంబేపల్లె (రాయచోటి)

జీవన వికాసానికి, సామాజిక పురోగతికి సోపానాలు గ్రంథాలయాలని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. యువకులు, విద్యావంతులు, విద్యార్థులు అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సంబేపల్లి బ్రాంచ్ గ్రంథాలయం రికార్డ్ అసిస్టెంట్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ నవంబరు 14 నుండి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కావున విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు రెడ్డయ్యరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు వెంకట్రామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



మృతి చెందిన కానిస్టేబుల్ రవి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యతో తీవ్ర మనస్థాపానికి గురై తాను పని చేస్తున్న కార్యాలయంలోనే ఓ కానిస్టేబుల్ శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఎస్‌పి కార్యాలయంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...కడప జిల్లా పోరుమామిళ్ళ మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కవలకుంట్ల రవి అనే 2009 బ్యాచ్‌కు చెందిన సివిల్ కానిస్టేబుల్ సంవత్సరం నుంచి అన్నమయ్య జిల్లా ఎస్‌పి కార్యాలయంలోని డిసిఆర్‌బి అనే ఓవింగ్‌లో పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా రవి కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యతో బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురై తాను పని చేసే కార్యాలయంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సొంత ఊరులో ఉండడంతో రవి ఎస్‌పి కార్యాలయంలోనే ఉంటూ హోటల్‌ల్లో తింటూ ఆఫీసులోనే నిద్రిస్తూ వచ్చారు. తెల్లవారిన కూడా ఆఫీసు తలుపులు తీయకపోవడంతో కార్యాలయానికి వచ్చిన తోటి సిబ్బంది తలుపును ఇనుప రాడ్డు సహాయంతో బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూసే సరికి కానిస్టేబుల్ రవి ఉరి వేసుకొని వేలాడుతూ ఉన్నాడు. వెంటనే సిబ్బంది కిందకు దింపి హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిక్షించి రవి మృతి చెందినట్లు నిర్ధారించారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అక్కడ నుండి మార్చురీలోకి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలు అనారోగ్య సమస్యతోనే రవి ఆత్మహత్యకు కారణమైవుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. డిఎస్‌పి మహబూబ్ బాషా ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు జిల్లాలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూమ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో ఐదు స్థాయిలలో నిర్వహిస్తామన్నారు. గ్రామ/వార్డు స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉంటుందన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో 15 సంవత్సరాలు వయసున్న బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలను ఒక పండుగ వాతావరణంలో క్రీడా సూర్తితో నిర్వహించాలని పేర్కొన్నారు. ఇందులో త్రీ కే మారథాన్, యోగా, టెన్నికాయిట్, ఇతర సంప్రదాయ క్రీడలను కూడా వీటితో పాటు నిర్వహించవచ్చునన్నారు. క్రీడా పోటీలలో పాల్గొని విజేతలైన వారికి నగదు బహుమతి ట్రోఫీ మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని తెలిపారు. అధికారులు క్రీడా సామగ్రిని సమకూర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, డిఇఒ శ్రీరాం పురుషోత్తం, జిఎస్‌డబ్ల్యుఎస్ కో-ఆర్డినేటర్ మనోహర్‌రాజు, జిల్లా హెడ్ కోచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాలో మత్తు పదార్థాలను పూర్తిగా నియంత్రించాలి : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో మత్తు పదార్థాలను పూర్తిగా నియంత్రించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కానారేన్స్ హాల్ నందు జిల్లా ఎస్పీ క ృషా?రావుతో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై కలెక్టర్ గిరీష, జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించిన కమిటీలు చురుకుగా పని చేయాలని పేర్కొన్నారు. వీటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోకపోతే అరికట్టడం సాధ్యం కాదని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో మత్తు పదార్థాల నివారణ పై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మారుమూల గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో అంతర్ పంటగా వేస్తున్న గంజాయి ఉత్పత్తులను గుర్తించి సమాచారాన్ని పోలీసులకు చేలవేయాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పూర్తి చర్యలు చేపడుతున్నామని వీటి నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన 14500, టోల్ ఫ్రీ నెంబర్ కు వెంటనే ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం, తదితర అధికారులు పాల్గొన్నారు.

'నాసా'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నాసా నిర్వహించిన కాంపిటీషన్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ స్వాతి తెలిపారు. శుక్రవారం శ్రీ చైతన్య పాఠశాలలో నాసా కాంపిటీషన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ స్వాతి ఆధ్వర్యంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ఓబుళపతి చేతులమీదుగా నాసా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రొఫెసర్ ఓబుళపతి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని వివిధ రకాల ప్రయోగాలు చేపట్టి దేశానికి మంచి పేరు తీసుకొచ్చి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రిన్సిపల్ స్వాతి మాట్లాడుతూ నాసా ఎంపిక చేసిన అనేక ప్రయోగాలలో అధిక సంఖ్యలో శ్రీ చైతన్య విద్యార్థులవే ఉండడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం రమణయ్య, కో-ఆర్డినేటర్ కుటుంబరావు, డీన్ శివశంకరయ్య, నాసా ఇంచార్జి చిన్న రెడ్డెయ్య, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

ఎంపిఎఫ్‌సి గోడౌన్ల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో చేపడుతున్న ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ల నిర్మాణాలు డిసెంబర్ 15వ తేదీ లోపల పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో జిల్లా కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మొదటి దశలో ఆరు మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మంజూరయ్యాయన్నారు. అందులో 4 పూర్తయ్యాయని మిగిలిన 2 డిసెంబర్ 15వ తేదీ లోపల పూర్తి చేసి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు స్వాధీన పరచాలన్నారు.మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ కింద రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా నిర్మిస్తున్న గోదాముల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులను ఎప్పటికప్పుడు కమిటీ పర్యవేక్షణలో పూర్తిచేయాలన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం జిల్లాలోని అర్హులైన పాడి రైతులకు డిసిసిబి, ఇతర బ్యాంకుల ద్వారా త్వరితగదన రుణాలు ఇప్పించాలన్నారు. నిలిచిపోయిన ఎఎంసియులను తిరిగి ఈనెల చివరికల్లా ప్రారంభించాలని ఆదేశించారు. పాడి రైతులకు, కౌలు రైతులకు వ్యవసాయ శాఖ వారు సిసిఆర్‌సి కార్డ్స్ ఇచ్చిన రైతు లందరికీ రుణాలు ఇప్పించడంలో నిర్లక్ష్యం చేయరాదని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు.వివిధ దశలలో ఉన్న బిఎంసియుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. గుర్రంకొండ వద్ద ప్రాథమిక సహకార సంఘానికి రెండు ఎకరాల స్థలాన్ని గుర్తించి గోడౌన్ నిర్మించుటకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి గురుప్రకాష్‌రావు, పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పిళ్లై, వ్యవసాయశాఖ జెడి చంద్రనాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న గాయత్రి ప్రియా, సుశీంద్రరెడ్డి బెంగళూరులోని జయప్రీత కన్సల్టింగ్ ప్రయివేట్ లిమిటెడ్ వారు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశం కలిపించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. వీరు 2024 ఫిబ్రవరి వరకు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. వారికి నెలకు రూ.15 వేలు చెప్పున అందజేస్తారని చెప్పారు. బి.టెక్ కోర్స్ పూర్తయిన తరువాత ఉద్యోగంలో చేరుతారన్నారు. వీరు మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ సిస్టమ్స్‌పై పనిచేస్తారని పేర్కొన్నారు. ఇదే విభాగానికి చెందిన హరీష్ అనే విద్యార్థికి న్యూఢిల్లీలోని స్టార్ట్ ఎక్స్ లాబ్స్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ వారు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశం కల్పించినట్లు, 3 నెలల పాటు నెలకు రూ.11మ వేలు చెప్పున, ఆ తరువాత విద్యార్థి పనితీరు ఆధారంగా స్టయిఫండ్ పెరుగుతుందని పేర్కొన్నారు. కోర్స్ పూర్తయిన వెంటనే ఉద్యోగంలో కొనసాగుతారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

వాలీబాల్ జట్టుకు 'సాయి' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-రాయచోటి

శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగపు విద్యార్థి సయ్యద్ అహ్మద్, కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించిన వాలీబాల్ క్రీడా ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జెఎన్‌టియు వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబర్చడం ఆనందంగా ఉందన్నారు. వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సుభహాన్, కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్స్ మల్లేశ, రవి మోహన్, అధ్యాపకులు అభినందించారు.

అక్రమ కేసులు బనాయించడం సరికాదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దోపిడీలు, గుండా రాజకీయాలతో అస్తవ్యస్థంగా ఉందని వాటిని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడమే వైసిపి నైజంగా ఉందని జనసేన పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. పట్టణ పరిధిలోని బలిజపల్లి, నునేవరిపల్లిలో మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం 124వ రోజు పవనన్న ప్రజా బాటకార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు, కొత్తూరు వీరయ్య ఆచారి, గోపి, నారా కిషోర్, చౌడయ్య, వీర మహిళలు జడ్డ శిరీష, మాధవి పాల్గొన్నారు.



మురళికి చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

విభిన్న ప్రతిభావంతుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

సొంతిల్లు నిర్మాణం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెనగలూరు మండలానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు కాణిపాక మురళీఆచారి ముక్కాఫౌండేషన్ ట్రస్ట్ తరుపున యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. పుట్టుకతో అంధత్వం, వినికిడి లోపంతో బాధపడుతున్న విభిన్న ప్రతిభావంతుడు సొంతిల్లు నిర్మాణం చేపట్టి డబ్బులేక నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న సాయివికాస్‌రెడ్డి ఆగిపోయిన ఇంటి నిర్మాణం చేపట్టుకోమని తక్షణ సాయంగా రూ.50 వేలు అందించారు. ఏకష్టమొచ్చిన నేనుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్‌రెడ్డి మల్లు సబ్బునరసారెడ్డి, వాహిద్, నరసింహులు, తిరుపాల్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

- కమిషనర్ పి.ఆర్.మనోహర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట



ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బి.కొత్తకోట నగరపంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ వెల్లడించారు. దోమల నివారణ కోసం పట్టణంలోని అన్ని వీధిలోలో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని చెప్పారు. డెంఢీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా పట్టణంలో ప్రతి రోజు ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేయించడం జరుగుతోందన్నారు. ఈ బాధ్యతలను నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ఎఇ రాజేందర్‌కు అప్పగించినట్లు తెలిపారు. బాలికల పాఠశాల, ఎస్‌సి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బిసి కాలనీలో పారిశుధ్య చేపట్టామని, పట్టణంలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు యధావిధిగా జరుగుతున్నా యన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

తేక్వాండోలో ప్రతిభ చాటిన లక్ష్మీనిశాంత్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న డి.లక్ష్మీనిశాంత్ ఎస్‌జిఎఫ్ అండర్-19 తేక్వాండో రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా శుక్రవారం రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడని పాఠశాల పీడీ నీలకంఠరావు, ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నిశాంత్ రాష్ట్ర స్థాయి లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా ఇలాంటి పథకాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో నిరంతరం శ్రమిస్తే ఇలాంటి పథకాలు సాధించడం సులువుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు చేరిన వంట పాత్రలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం లోని 86 పాఠశాలలకు పౌర సరఫరాల వాహనం ద్వారా వంట పాత్రలు పంపిణీ చేశారు. ఈ పాత్రలను మండల రెవెన్యూ అధికారి మహేశ్వర్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జయన్న, ఉపాధ్యాయులు, విఆర్‌ఒ రవి అధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ పాఠశాలలో ఎంఇఒ-2 నాగ తిరుమలరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగ తిరుమలరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చదువుకుంటున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అందులో భాగంగా కొంతమంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు కంటి పరీక్షల్లో తెలిసిందని దృష్టిలోపం ఉన్న విద్యార్థులకే కంటి అద్దాలు పంపిణీ చేస్తామని ఎంఇఒ తెలిపారు. స్థానిక వైద్య శాఖ అధికారులు ఓబులేసు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటిఅద్దాలు పంపిణీ చేశామన్నారు. ఉపాధ్యాయులు కూడా దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించాలని సూచించారు.

కాపునాడు జిల్లా అధ్యక్షులుగా కేదార్‌నాథ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లా రాయల్ కాపునాడు అధ్యక్షులుగా కేదార్‌నాథ్‌ను నియమిస్తూ రాయల్ కాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోటకృష్ణ శుక్రవారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కేదార్నాథ్ రాయల్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, వ్యాపార, క్రీడా, సాంస్కృతిక రంగాలలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలవారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు సమైక్య కాపు నినాదంతో వారి అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు.

ఘనంగా సిపి బ్రౌన్ జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిపి బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపిబ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సిపి బ్రౌన్‌గా తెలుగు వారికి తెలిసిన చార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించారని, తండ్రి మరణంతో వీరి కుటుంబం తిరిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయిందన్నారు. 1840లో తెలుగు వ్యాకరణం ప్రచురించారని, నలచరిత్ర, పలనాటి వీరచరిత మొదలైన వాటిని ప్రచురించారన్నారు. తెలుగుబాషా సాహిత్యం కోసం తన జీవితాన్ని ఖర్చు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు సువర్ణాదేవి, మహబూబ్‌జాన్, రమాదేవి, యశోద, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు :** తెలుగు సూర్యుడిగా మన భాషా సాహిత్యాలకు ఎనలేని కృషిచేసిన సి.పి.బ్రౌన్ 225వ జయంతి ఉత్స వాలను మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌బాషా అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గీత, రమణమ్మలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలలోని మాధుర్యాన్ని చవిచూసి దాన్ని అక్కున చేర్చుకుని ఆదరించి అందలమెక్కించిన సిపి బ్రౌన్ మనకు ఆరాధ్యనీయుడైనాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ నాగేంద్రప్రసాద్, శిల్పి ఆనందాచారి, తులసీ స్వర్ణలత, విజయకుమారి, బోగా వెంకటసుబ్బయ్య, లక్ష్మీనా రాయణ, మస్తాన్, జీవి రమణ, సుబ్బరాయుడు, జీవి ప్రసాద్ రావు, ఆర్ వి రమణమ్మ, జ్యోతి ప్రియ, ప్రమీలా రాహేల్, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య పాల్గొని సిపి బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పించారు.



వాల్మీకిపురం : సిపి బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట :'చింతల'

ప్రజాశక్తి-కలకడ



ప్రజల నుంచి సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కొనియాడారు. శుక్రవారం మండలంలోని నడిమిచర్ల పంచాయతీ కొత్తపల్లి నడిమిచర్ల చిన్న మొటుకు అడవిలో మాదిగపల్లె గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అధికారులు చేరువుగా ఉండేటట్లు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటరీ వ్యవస్థ స్థాపించి ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ధృవీకరణ పత్రాలు కోసం మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగే వారని ఇప్పుడు అలా కాకుండా గ్రామ సచివాలయాల్లోనే ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాడు-నేడు పథకం పాఠశాల రూపురేఖలు మార్చి విద్య వ్యవస్థ నూతన ఒరవడికి నాంది పలికారని చెప్పారు. గత ప్రభుత్వం కంటే పింఛన్లను ఎక్కువగా ఇచ్చిన ఘనత కూడా సిఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపి శ్రీదేవిరవికుమార్, మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, ఆర్‌బికె మండల కన్వీనర్ హరినాద్‌రెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి, సర్పంచులు లింగమ్మ, రాజగోపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎంఇఒ మునీంద్రనాయక్, ఎపిఒ చెన్నకేశవులు, ఎపిఎం రమేష్, ఎస్ఐ తిప్పేస్వామి, ఎఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రామసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని గొల్లపల్లి, రామసముద్రం దళితవాడ కుమారునిపల్లి సచివాలయ పరిధిలోని దళితవాడ, కోనయ్య గారి పల్లి, కోనయ్య గారి పల్లి హరిజనవాడ, అరుంధతి వాడ తదితర గ్రామాల మీదుగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ పభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాసమస్యలు తెలుసుకొని సమస్యలకు పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ రెడ్డి, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, స్టేట్ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ పిచ్చిరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, తాసిల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒరఘురాం, ఎస్ఐ రఘురాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి : జెడి



రైతుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న చంద్రనాయక్

ప్రజాశక్తి-రామాపురం

ఖరీఫ్‌లో ఇ-క్రాపింగ్ చేయించుకున్న రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఇ-క్రాపింగ్ నమోదు చేయించుకుంటే ఆర్‌బికె సిబ్బంది నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రతి ఆర్‌బికెలో రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు బ్లాక్‌లో ఎరువులు కొని నష్టపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఎడి జయరాణి, మండల వ్యవసాయ అధికారిని నాగమణి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెద్ద రెడ్డి, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కలికిరి



కలికిరి : వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్ విద్యార్థిని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నయనారు మధుబాల , కార్యదర్శి శర్మ ఆదేశాల మేరకు 56వ జాతీయ గ్రంథాలయ ప్రారంభ వేడుకలు ఈ నెల 14 నుండి 20 వ తేది వరకు ఘణంగా నిర్వహించబడుతాయని ఆయన అన్నారు. కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కరపత్రాలను తహశీల్దార్ భాగ్యలత, ఎంఇఒ కరీముల్లా, ఎంపిడిఒ గంగయ్యలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 56వ గ్రంథాలయ వారోత్సవాలలో ప్రజలు, విద్యార్థుల, మేధావులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ఈ నెల 18 తేదీన విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు 20న జరుగు ముగింపు కార్యక్రమంలో బహుమ తులు ప్రదానం చేస్తామన్నారు. **కలకడ :** గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు కలకడ శాఖ గ్రంథాలయ అధికారి అమర్నాథ తెలిపారు. మండల కేంద్రమైన కలకడలోని గ్రంథాలయంలో ఈనెల14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్స వాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనార్ మధుబాల, కార్యదర్శి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, 15న, పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల గురించి పోరాడిన నాయ కులను స్మరించుకొనుట, 17న కవి సమ్మేళనాలు సెమినార్లు, 18న పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనము, వంటివి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 19న మహిళ సాధికారత పై చర్చ, 20వ తేదీన బహుమతి ప్రదానం, ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

అభివృద్ధికి సోపానాలు సచివాలయాలు :'గడికోట'


ప్రజాశక్తి-సుండుపల్లి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాలు అభివృద్ధికి సోపా నాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నమండెం-2 సచివాలయ నూతన భవనాన్ని మాజీ జడ్‌పి వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసానిస్తోందని అన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నారని చెప్పారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డి మాట్లాడుతూ సచివాలయాల్లో జవాబుదారితనం, పారదర్శకంగా సేవలు అందుతున్నా యన్నారు. ప్రజల సమస్యలు, వినతులుపై సచివాలయ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, నాయ కులు శివారెడ్డి, బాబురెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ గౌస్‌సాబు, మండల ఉపాధ్యక్షుడు ఎజాష్ అలీ ఖాన్, సర్పంచు నజీర్‌అహ్మద్, జిల్లా విజిలేన్స్ కమిటీ నెంబర్ చుక్కా అంజనప్ప, ఎంపిటిసిలు రమేష్, శ్యామ్, వెంక టప్ప నాయుడు, రెడ్డెప్ప, రమణ,సర్పంచులు దామోదర్‌లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, మంత్రులు ఉషశ్రీచరణ్, నాగార్జున అన్నారు. శుక్రవారం ములకలచెరువులో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు 50శాతం పైగా రాజకీయ పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2024లో మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని అన్నారు. రాష్ట్రంలో 156 సామాజిక కులాలు ఉన్నాయని, వారందరికి న్యాయం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. అనంతరం మంత్రి నాగార్జున, ఉషశ్రీచరణ్ లు మాట్లాడుతూ గత నాలుగన్నరేళ్ల వైసిపి పాలనలో అవినీతికి తావు లేకుండా పరిపాలన చేస్తున్నారన్నారు. 35 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీకలు రూ.1018 కోట్లు జగన్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నాడు లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకంలో నడిపించన ఘనత పెద్దిరెడ్డి కుటుంబాకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజాన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రఘురాం, జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండఖలీల్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజనీసురేంద్ర, మండల కన్వీనర్ మాధవరెడ్డి, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవింద్రారెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీదేవి

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

కలకడ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల బోర్డు ను ఆవిష్కరిం చినట్లు ఎంపిపి శ్రీదేవి రవికు మార్ తెలిపారు. మండ లం లోని దేవల పల్లి పంచాయతీ నందు దేవులపల్లి సచివాల యంలో సంక్షేమ పథకాల బోర్డ్ ఆవిష్కరణ చేశారు. దేవులపల్లి పంచా యతీలో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ది ఎంతమందికి చేకూరిందో అందరికీ తెలిపినట్లు చెప్పారు. ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని అన్నారు. పార్టీ జెండాను కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపిపిలు ఎగుర వేశారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఇఒ అండ్ ఆర్‌డి లతీఫ్‌ఖాన్, మండల కన్వీనర్ మోహన్ రాజా, కోన సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బస్సు యాత్రకు తరలివెళ్లిన వైసిపి శ్రేణులు

తంబళ్లపల్లె : పిటిఎం మండలం నుంచి ములకలచెరువు వైసిపి చేపట్టిన సామాజిక సాధికారిక బస్సుయాత్ర బహిరంగ సభకు శుక్రవారం తంబళ్లపల్లె నుంచి జనం తండోపతండాలుగా వెళ్లారు. పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిధులు, నాయకులు తరలి వెళ్లారు. మండలం నుండి 250 వాహనాలలో వెళ్లారు.

ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని రెడ్డివారిపల్లిలో గల తపస్య విద్యాసంస్థలో కరస్పాండెంట్‌లు రామాంజులు, శివప్రసాద్ ఆధ్వ ర్యంలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామాంజులు మాట్లాడుతూ దీపావళి గురించి వివరిస్తూ చెడుపై మంచి గెలిచిన రోజుగా దీపావళిని జరుపుకుంటారని విద్యార్థులకు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు రెడ్డప్ప మాట్లాడుతూ దీపావళి పిల్లలందరికీ నచ్చిన పండువగని పండుగ విశిష్టతను వివరించారు. బాణాసంచా కాల్చేటప్పుడు విద్యార్థులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయురాలు మాధవి, ప్రేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.



బి.కొత్తకోట : టపాసుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టపాకాయలు విక్రయించేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడే టపాకాయలు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా దుకాణదారులు అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టపాకాయల విక్రయిస్తే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిషనరుతోపాటు నగర పంచాయతీ ఆర్.ఐ.శ్రీనివాసులు, ఎఇ రాజేంద్ర, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. **మదనపల్లె :** మదనపల్లి అగ్నిమాపక కేంద్రం పరిధిలో బాణా సంచా విక్రయాలకు 42 దరఖాస్తులు వచ్చాయని మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప తెలిపారు. స్థానిక మిషన్ కాంపౌండ్‌లో 22 దుకాణములు, టిప్పు సుల్తాన్ గ్రౌండ్‌లో 8, సిటిఎంలో 2, రామసముద్రంలో 2, చెంబకూరులో 2, అంగళ్లులో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. టపాసుల దుకాణా దారులు అగ్నిమాపక నిబంధనలు తప్పక పాటించాలన్నారు. **పెనగలూరు :** టపాసుల యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మన్నూరు సిఐ మంజునాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే యాజమానులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు చట్టపరమైన సమస్యలు ఏమైనా ఏర్పడినప్పుడు తనను నేరుగా సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి పోలీసు శఖా వారు దుకాణాల యజమానులు పాల్గొన్నారు. **నందలూరు:** టపాసుల దుకాణాల యజమానులు నిబంధనలు తప్పక పాటించి, ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సత్యానందం, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, ఫైర్ ఎస్ఐ మాబు సుభాన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో మండలంలోని టపాసుల దుకాణాల యజమానుల తో సమావేశం నిర్వహించారు. ఇసుక, రెండు డ్రమ్ముల నీళ్లు ఉంచుకోవాలని అన్నారు. పండుగ ముగిసిన తర్వాత ఎక్కడి నుంచి కొనుగోలు చేశారో అక్కడే టపాసులు ఇచ్చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మోహన్ కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బూర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 278 మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, సామాజిక స్పృహను పెంపొందించు కోవాలన్నారు. విద్యతోపాటు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యంగ్‌ఇండియా సేవ ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిలకు న్యాయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్రంలో బిసిల భరోసాబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి సహకారంతో లక్కిరెడ్డిపల్లెలోని టిడిపి కార్యాలయంలో బిసిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సాధికార సమితి సంక్షేమ సంఘం కన్వీనర్ యం. పోతులయ్య మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల అభివృద్ధి కోసం ముఖ్యంగా బిసిల కోసం టిడిపి ముందుండి పోరాటం చేస్తోందన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి తీసుకు రావడానికి మనందరం కలిసి పనిచేసి పార్టీని గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. మండలంలోని బిసి కుల సంఘాల ప్రజలు ఐక్యతతో కలసి పనిచేయాలన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో బిసిలకు టిడిపి ఇచ్చిన వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బిసిలంతా ఐక్యంగా ఉన్నప్పుడే మనకు రావాల్సిన సంక్షేమ పథకాలు మనం సాధించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి టిడిపి మండల బిసి సెల్ కన్వీనర్ జయరాం, కొనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ, మద్దిరేవుల సర్పంచ్, టి.చంద్రమ్మ, దప్పేపల్లి సర్పంచ్ కేశవయ్య, సర్పంచ్ చెంద్రా యుడు, అంజెనేయులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

బి.కొత్తకోట : మండలంలోని మొటుకు పోలింగ్ కేంద్రాన్ని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌డిసి రాఘవేంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 4,5 తేదీల్లో ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిందన్నారు. అందులో మార్పులు, చేర్పులు అనంతరం ఓటర్ జాబితా పకడ్బందీగా తయారు చేశారా లేదా అనే విషయాన్ని బిఎల్ఒలను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది ఓటు కోసం నమోదు చేసుకున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఓటు హక్కు అనేది ప్రధానమైందన్నారు. 18 సంవత్సరాల నిండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రఫీక్ అహ్మద్, డిటి మౌలా, విఆర్ఒ వెంకటేష్ పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు కిసాన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోడూరు మండలం ఓబనపల్లెక్ష్మీ-1 రైతు భరోసా కేంద్రంలో రైతులకు కిసాన్ డ్రోన్ వినియోగంపై గరుడ కంపెనీ వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాముఖ్యతను ఇస్తోందన్నారు. కిసాన్ డ్రోన్ టెక్నాలజీని రైతులు వినియోగించుకుని ఎరువులను క్రిమిసం హారక మందులను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు అందించవచ్చునని అన్నారు. కూలీల సమస్యను అధిగమించవచ్చునని తెలిపారు. గరుడా కంపెనీ టెక్నికల్ మేనెజర్ దిలీప్ డ్రోన్ ఉపయోగించే విధానం డోంట్ టెక్నాలజీ వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి జిజసుధాకర్ మాట్లాడుతూ ఐదు మంది రైతులు గ్రూప్‌గా ఏర్పడి పది లక్షల విలువ చేసే డ్రోన్‌ను అగ్రికల్చర్ డిగ్రీ లేదా డిప్లమా ఉన్న వారిని ఫైలట్ గా ఎంచుకున్నట్లయితే 50శాతం రాయితీ, ఇతరులకు 40 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. బొప్పాయి, మామిడిలో డ్రోన్ల ద్వారా మందులపిచికారిని చేసి చూపించారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లె మండలవ్యవసాయ అధికారి బి.మల్లిక, చిట్వేలి అధికారి కె.శ్రీకర్ ఉద్యానవనశాఖఅధికారి ఎం.భాస్కర్, ఆర్‌బికె, ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తాకాటం వారిపల్లిలో నివాసమున్న బత్తల మల్లికార్జున కుమారుడు బత్తల విశ్వనాథ్(23) గురువారం రాత్రి చింతమానుకు ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గత నెలలో తన మామ చనిపోయాడని మనోవేదనతో బాధపడుతూ ఉండేవాడని, మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారని తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు.